సాక్షి
విజయనగరం

సోమవారం । 13 । మార్చి । 2023



చెరకు రైతుకు ఊరట

ప్రభుత్వ తీసుకున్న నిర్ణయంతో మూడు జిల్లాల చెరకు రైతులకు ఊరట లభించింది.

- 8లో



అంగన్‌వాడీల్లో ఆర్‌ఓ ప్లాంట్లు

అంగన్‌వాడీ కేంద్రాల్లో చదివే పిల్లలు, గర్భిణులకు సురక్షిత తాగునీటిని అందించేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టింది.

- 8లో



వాలీబాల్ అసోసియేషన్ ఏకగ్రీవం

జిల్లా వాలీబాల్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులుగా జి.సూరిబాబు, కేవీఏఎన్ రాజు, కోశాధికారిగా కె.సన్యాసి నాయుడుతో నూతన జిల్లా కమిటీ ఏకగ్రీవంగా ఎన్నికైంది. - 8లో

న్యూస్‌రీల్

నేడు రామనారాయణం వార్షికోత్సవం

విజయనగరం రూరల్: ప్రముఖ ఆధ్యాత్మిక, పర్యాటక కేంద్రమైన రామనారాయణం తొమ్మిదో వార్షికోత్సవం సోమవారం నిర్వహించనున్నట్లు ఆలయ ట్రస్టీ నారాయణం శ్రీనివాస్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం సుప్రభాత సేవ, ఆరు గంటలకు అర్చన, అష్టకలశ స్నపన, నవగ్రహ మఖం, నవగ్రహ హోమం, ప్రసాద వితరణ చేపట్టడం జరుగుతుందన్నారు. అలాగే సాయంత్రం 5 గంటలకు శ్రీదేవి, భూదేవి సమేత వైకుంఠ నారాయణునికి ప్రత్యేక పూజలతో పాటు సీతారామ కల్యాణం నిర్వహిస్తామని, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు.

ఓటు హక్కు వినియోగానికి కార్మికులకు అనుమతి

- కార్మికశాఖ ఉప కమిషనర్ సుబ్రమణ్యం

విజయనగరం రూరల్: ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో పట్టభద్రులైన కార్మికులకు ప్రైవేటు సంస్థలు ఆలస్య హాజరుకు అనుమతి ఇవ్వాలని కార్మిక శాఖ ఉప కమిషనర్ ఎస్.సుబ్రమణ్యం ఆదేశాలు జారీ చేశారు. సోమవారం జరగనున్న పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో వివిధ దుకాణాలు, సంస్థలు, పరిశ్రమలు, ప్రైవేటు విద్యా సంస్థల్లో పని చేస్తున్న పట్టభద్రులైన కార్మికులు ఓటు నమోదు చేసుకుంటే, వారికి ఓటు హక్కు వినియోగించుకునేలా అనుమతి ఇవ్వాలని ఆయన ఆదేశించారు. ఎన్నిక ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు నిర్వహిస్తారని, ఓటు హక్కు వినియోగించుకునే సమయంలో ఆలస్యమైనా విధులకు అనుమతించాలని ఆయన సూచించారు.

అండర్ - 19 క్రికెట్ జట్టు ఎంపికలకు స్పందన



పోటీల్లో తలపడుతున్న క్రీడాకారులు

విజయనగరం: జిల్లా క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన అండర్ - 19 బాలుర క్రికెట్ జట్టు ఎంపిక పోటీలకు స్పందన లభించింది. నగర శివారుల్లోగల సర్ విజ్జీ స్టేడియంలో ప్రాంగణంలో అసోసియేషన్ జిల్లా కార్యదర్శి ఎంఎల్ఎన్ రాజు ఆధ్వర్యంలో ఎంపిక పోటీలకు జిల్లా నలుమూలల నుంచి 90 మంది క్రీడాకారులు హాజరయ్యారు. ఎంపిక పోటీలకు హాజరైన క్రీడాకారులు బ్యాటింగ్, బౌలింగ్, ఫీల్డింగ్ వ్యక్తిగత సామర్థ్య పరీక్షలు నిర్వహించగా... ప్రాబబుల్స్ జట్టుకు ఎంపికైన క్రీడాకారుల జాబితాను రానున్న రెండు రోజుల్లో ప్రకటిస్తామని నిర్వాహకులు తెలిపారు. ఎంపిక పోటీలను బంగార్రాజు, వర్మ, సర్ఫరాజ్‌లు పర్యవేక్షించారు.

నేడే పట్టభద్రుల ఎమ్మెల్సీ పోలింగ్



ఎన్నికల సామగ్రితో పోలింగ్ కేంద్రాలకు వెళ్తున్న సిబ్బంది



ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్న కలెక్టర్ సూర్యకుమారి

- ఏర్పాట్లు పూర్తి చేసిన యంత్రాంగం
- 72 పోలింగ్ కేంద్రాల ఏర్పాటు
- జిల్లాలో 58,502 మంది గ్రాడ్యుయేట్ ఓటర్లు
- ఫిర్యాదుల కోసం వాట్సాప్ నంబరు 83338 13468

విజయనగరం అర్బన్:

ఉత్తరాంధ్ర పట్టభద్రుల నియోజకవర్గ శాసన మండలి ఎన్నికకు ఏర్పాట్లు పూర్తయ్యాయి. ఈ స్థానం కోసం మొత్తం 37 మంది అభ్యర్థులు పోటీ పడుతున్నారు. సోమవారం ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 4 గంటల వరకు పోలింగ్ జరగనుంది. దీని కోసం జిల్లాలో 72 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. జిల్లా వ్యాప్తంగా ఇప్పటికే ఓటర్లందరికీ బీఎల్‌ఓల ద్వారా ఓటరు స్లిప్పుల పంపిణీ పూర్తి చేశారు. పోలింగ్ కేంద్రం సమీపంలో కూడా ఓటరు స్లిప్పులు అందజేసేందుకు ఏర్పాట్లు చేశారు. ఓటరు స్లిప్పుతో పాటుగా ఎన్నికల కమిషన్ నిర్దేశించిన 14 రకాల గుర్తింపు కార్డుల్లో ఏదో ఒక దాన్ని ఓటర్లు తీసుకురావాల్సి ఉంది. పోటీ చేస్తున్న అభ్యర్థులకు ప్రాధాన్యతా క్రమంలో అంకెల ద్వారా ఓటు వేయాల్సి ఉంటుంది. కలెక్టరేట్ కంట్రోల్ రూము నుంచి ఎన్నికల ఏర్పాట్లను కలెక్టర్ ఎ. సూర్యకుమారి ఆదివారం పర్యవేక్షించారు. పోలీసు బందోబస్తు ఏర్పాట్లను ఎస్పీ దీపికా పాటిల్ పర్యవేక్షిస్తున్నారు. ఫిర్యాదులు స్వీకరించేందుకు వాట్సాప్ నంబరు 83338 13468ను ఏర్పాటు చేశారు.

58,502 మంది ఓటర్లు

జిల్లాలో 58,502 మంది పట్టభద్ర ఓటర్లు ఉండగా వీరి కోసం జిల్లా యంత్రాంగం 72 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేసింది. జిల్లాలో మొత్తం ఓటర్లలో 38,625 మంది పురుషులు, 19,868 మంది మహిళా ఓటర్లు, 9 మంది థర్డ్ జెండర్ ఓటర్లు ఉన్నారు. విజయనగరం డివిజన్‌లో అత్యధికంగా 33,625 మంది ఓటర్లు ఉండగా చీపురుపల్లిలో 14,256 మంది, బొబ్బిలిలో 10,603 మంది ఓటర్లు ఉన్నారు.

72 పోలింగ్ కేంద్రాల ఏర్పాటు

జిల్లాలో పట్టభద్ర ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ కోసం 72 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నారు. విజయనగరం డివిజన్‌లో 42, బొబ్బిలిలో 13, చీపురుపల్లిలో 17 చొప్పున పోలింగ్ కేంద్రాలు ఏర్పాటవుతున్నాయి. ఒక్క విజయనగరం పట్టణంలోనే 20 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నారు.

పోలింగ్ కేంద్రాలకు ఎన్నికల సిబ్బంది



బ్యాలెట్ పేపర్లను చూసుకుంటున్న సిబ్బంది

జిల్లాలో ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ సజావుగా జరిపేందుకు తగిన సంఖ్యలో పోలింగ్ సిబ్బందిని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ ఆదేశాల మేరకు నియమించారు. 72 పోలింగ్ కేంద్రాలకు 72 మంది పీఓలతో పాటు రిజర్వులో మరో 18 మందిని పీఓ విధులు నిర్వహించేందుకు సిద్ధం చేశారు. 72 మంది ఏపీఓలు 18 మంది రిజర్వు ఏపీలు, 144 మంది ఓపీఓలు, మరో 41 మంది రిజర్వు సిబ్బందిని నియమించారు. వీరంతా ఇప్పటికే తమకు కేటాయించిన పోలింగ్ కేంద్రాలకు చేరుకున్నారు. జిల్లాను 13 జోన్లుగా విభజించి 13 మంది జోనల్ అధికారులను నియమించారు. 13 రూట్లుగా విభజించి 24 మంది రూట్ అధికారులను నియమించారు.

మైక్రో అబ్జర్వర్ల నియామకం

ఎన్నికలు సక్రమంగా సజావుగా జరిగేలా తగిన పర్యవేక్షణ చేసే నిమిత్తం ఎన్నికల సంఘం 72 మంది కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థల ఉద్యోగులను మైక్రో అబ్జర్వర్లగా నియమించింది. వీరికి అదనంగా మరో 18 మంది రిజర్వు అబ్జర్వర్లను కూడా నియమించారు. పోలింగ్ తీరును గమనించి దీనిపై ఎన్నికల సంఘానికి వీరు నివేదికలు అందజేస్తారు.

పోలింగ్ కేంద్రాలకు చేరిన బ్యాలెట్ బాక్సులు

పోలింగ్ కేంద్రాల్లో ఎన్నికల సరళిని పరిశీలించేందుకు జిల్లా పరిషత్ సీఈఓ ఆధ్వర్యంలో కలెక్టరేట్ కార్యాలయంలో కమాండ్ కంట్రోల్ సెంటర్‌ను ఏర్పాటు చేశారు. ప్రతి రెండు గంటలకు నమోదైన ఓట్లను తెలుసుకోవడంతో పాటు ఆయా కేంద్రాల్లో పోలింగ్ జరుగుతున్న విధానం, ఎక్కడైనా శాంతిభద్రతల సమస్యలు ఉత్పన్నమైందీ లేనిదీ సమస్యలు కూడా తెలుసుకుంటారు. కలెక్టర్ ఈ కమాండ్ కంట్రోల్ సెంటర్ నుంచే ఎన్నికల పర్యవేక్షణ చేస్తారు. ఫిర్యాదుల స్వీకరణ కోసం నంబరు 83338 13468 ఏర్పాటు చేశారు.

పోలింగ్ కేంద్రాల్లో ఏర్పాట్లు

జిల్లాలో ఏర్పాటు చేసిన 72 పోలింగ్ కేంద్రాల్లోనూ ఓటర్లకు అవసరమైన కనీస వసతులు కల్పించేందుకు యంత్రాంగం ఏర్పాట్లు చేసింది. తాగునీటి సదుపాయాలు, ప్రాథమిక వైద్య చికిత్స, ఓటర్లు నిల్చునేందుకు తగిన నీడ కల్పించే ఏర్పాట్లు చేశారు. అధిక సంఖ్యలో ఓటర్లు ఉండే కేంద్రాల్లో బ్యారికేడ్లు ఏర్పాట్లు చేస్తున్నారు. ఎన్నికల సరళిని వర్చ్యువల్‌గా పరిశీలించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. 72 కేంద్రాల్లోనూ సీసీ కెమెరాలను ఏర్పాటు చేసి పోలింగ్ జరుగుతున్న తీరును జిల్లా కేంద్రం నుంచి కలెక్టర్ ఇతర ఉన్నతాధికారులు పర్యవేక్షిస్తారు.

కలెక్టర్ కార్యాలయంలో రిసెప్షన్ సెంటర్

పోలింగ్ పూర్తయిన తర్వాత బ్యాలెట్ బాక్సులు తరలించి భద్రపరిచేందుకు కలెక్టర్ కార్యాలయంలో రిసెప్షన్ సెంటర్‌ను ఏర్పాటు చేస్తున్నారు. అన్ని ప్రాంతాల నుంచి బ్యాలెట్ బాక్సులు చేరిన తర్వాత వాటిని స్ట్రాంగ్ రూంలో భద్రపరచి ఇక్కడి నుంచి విశాఖకు తరలించే ఏర్పాట్లు చేశారు.

ప్రతి ఒక్కరూ ఓటు వినియోగించుకోవాలి : కలెక్టర్



కలెక్టర్ ఎ.సూర్యకుమారి

విజయనగరం అర్బన్: గ్రాడ్యుయేట్ ఓటర్లంతా ఎమ్మెల్సీ ఎన్నికల్లో తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని కలెక్టర్ ఎ.సూర్యకుమారి కోరారు. సోమవారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 4 గంటల వరకు ఎన్నిక జరుగుతుందని కలెక్టర్ తెలిపారు. స్థానిక ఆర్‌డీఓ కార్యాలయంలో ఎన్నికల ఏర్పాట్లను కలెక్టర్ ఆదివారం పర్యవేక్షించారు. విజయనగరంతో పాటు ఇతర పోలింగ్ కేంద్రాలకు బ్యాలెట్ బాక్సులను, బ్యాలెట్ పత్రాలను అందజేశారు. వారికి కేటాయించిన పోలింగ్ కేంద్రాలకు సిబ్బంది, సామగ్రి తీసుకొని తరలివెళ్లారు. వీరిని పోలింగ్ కేంద్రాలకు తరలించడానికి ప్రత్యేకంగా 15 ఆర్టీసీ సర్వీసులను జిల్లా యంత్రాంగం ఏర్పాటు చేసింది. డీఆర్‌ఓ ఎం.గణపతిరావు, ఆర్‌డీఓ ఎంవీ సూర్యకళ డిస్ట్రిబ్యూషన్ సెంటర్ నుంచి ఏర్పాట్లను పర్యవేక్షించారు. వెబ్ కాస్టింగ్ ద్వారా ఎన్నికల ప్రక్రియను కంట్రోలు రూం నుంచి పర్యవేక్షిస్తామని కలెక్టర్ తెలిపారు. ఎక్కువ పోలింగ్ బూత్‌లు ఉన్న కేంద్రాలపై ప్రత్యేక దృష్టి పెట్టామన్నారు.

పుష్కర కాలం... సకల జనుల సంక్షేమమే పథం

- విజయవంతంగా వైఎస్సార్‌సీపీ ఆవిర్భావ దినోత్సవం
- అన్ని నియోజకవర్గాల్లో పార్టీ శ్రేణుల సంబరాలు

సాక్షి ప్రతినిధి, విజయనగరం: సకల జనుల సంక్షేమం, సమ సమాజాభివృద్ధే ఏకైక పథంగా పుష్కల కాలం పూర్తి చేసుకున్న వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ విజయవంతంగా 13వ వసంతంలోకి అడుగుపెట్టింది. ఆదివారం అన్ని నియోజకవర్గాల్లో పార్టీ ఆవిర్భావ దినోత్సవాలు ఘనంగా జరిగాయి. పార్టీ నాయకులు, కార్యకర్తలు మిఠాయిలు పంచి పెట్టి సంబరాలు జరిపారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నేతృత్వంలో అన్ని వర్గాలకు పెద్దపీట వేస్తూ ఇటు పార్టీని, అన్ని ప్రాంతాల అభివృద్ధికి ప్రాధాన్యమిస్తూ అటు ప్రభుత్వాన్ని విజయవంతంగా నిర్వహిస్తున్నారని వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు, ఉమ్మడి విజయనగరం జిల్లా పరిషత్ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు అన్నారు. ఆయన ఆధ్వర్యంలో చీపురుపల్లిలోని పార్టీ కార్యాలయం వద్ద పార్టీ ఆవిర్భావ వేడుకలు ఘనంగా జరిగాయి. తొలిత దివంగత మహానేత వైఎస్సార్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. పార్టీ జెండాను ఎగురవేసి కేక్ కట్ చేశారు. డిప్యూటీ స్పీకరు కోలగట్ల వీరభద్రస్వామి ఆధ్వర్యంలో విజయనగరంలోని ఆయన నివాసం వద్ద పార్టీ ఆవిర్భావ వేడుకలు నిర్వహించారు. అంతకు ముందు వైఎస్సార్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. పార్టీ జెండాను కోలగట్ల ఆవిష్కరించారు. నగర పార్టీ అధ్యక్షుడు ఆశపు వేణు ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో విజయనగరం మేయరు వెంపడాపు విజయలక్ష్మి, ఎంపీపీ మామిడి అప్పలనాయుడు, మండల పార్టీ అధ్యక్షుడు నడిపేన శ్రీనివాసరావు, కార్పొరేటర్లు, పార్టీ నాయకులు పాల్గొన్నారు. ఎమ్మెల్సీ డాక్టరు పెనుమత్స సురేష్‌బాబు ఆధ్వర్యంలో నెల్లిమర్ల మండలం మొయిద గ్రామంలో పార్టీ ఆవిర్భావ వేడుకలు ఘనంగా జరిగాయి. ఎమ్మెల్సీ కేక్ కట్ చేసి నాయకులకు, కార్యకర్తలకు శుభాకాంక్షలు తెలియజేశారు. బొబ్బిలిలో ఎమ్మెల్యే శంబంగి వెంకట చినఅప్పలనాయుడు ఆధ్వర్యంలో పార్టీ ఆవిర్భావ వేడుకలు ఘనంగా నిర్వహించారు. మున్సిపల్ చైర్మన్ ఎస్.వి.మురళీ కృష్ణారావు, ఇంటి గోపాలరావు, శంబంగి వేణుగోపాలనాయుడు తదితరులు పాల్గొన్నారు. గజపతినగరం ఎమ్మెల్యే బొత్స అప్పలనర్సయ్య ఆధ్వర్యంలో పార్టీ ఆవిర్భావ దినోత్సవాలు ఘనంగా జరిగాయి. గజపతినగరంలోని పార్టీ కార్యాలయం వద్ద పార్టీ జెండాను ఆవిష్కరించారు. ప్రభుత్వ కమ్యూనిటీ ఆస్పత్రిలో 300 మంది రోగులకు పండ్లు, రొట్టెలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో నాలుగు మండలాలకు చెందిన పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. శృంగవరపుకోట ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో పార్టీ ఆవిర్భావ వేడుకలు ఘనంగా జరిగాయి. కొత్తవలసలోని క్యాంపు కార్యాలయం వద్ద నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ అధికారంలోకి వచ్చాక మేనిఫెస్టోలోని హామీలన్నీ అమలు చేశారని ప్రస్తావించారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ ఇందుకూరి రఘురాజు, కొప్పుల వెలమ కార్పొరేషన్ చైర్మన్ నెక్కల నాయుడుబాబు, కొత్తవలస ఎంపీపీ నీలం శెట్టి గోపమ్మ పాల్గొన్నారు. రాజాంలోని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయం వద్ద ఎమ్మెల్యే కంబాల జోగులు ఆధ్వర్యంలో పార్టీ ఆవిర్భావ దినోత్సవం ఘనంగా నిర్వహించారు. వైఎస్సార్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. పార్టీ జెండాను ఎగురవేశారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నేతలు, కార్యకర్తలు పాల్గొన్నారు.



విజయనగరంలో పార్టీ ఆవిర్భావ దినోత్సవంలో జెండా ఎగురవేస్తున్న డిప్యూటీ స్పీకర్ కోలగట్ల



చీపురుపల్లిలో పార్టీ జెండాను ఎగురవేస్తున్న జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు

శ్రీరామ నవమికి ముస్తాబవుతున్న రామతీర్థం

నెల్లిమర్ల రూరల్: పవిత్ర పుణ్యక్షేత్రమైన రామతీర్థం సీతారామస్వామి దేవస్థానం శ్రీరామనవమి ఉత్సవాలకు ముస్తాబవుతోంది. ఈ నెల 30న రాష్ట్ర ప్రభుత్వ లాంఛనాలతో నవమి వేడుకలు జరగనున్న సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో ఆలయం వెలుపుల ఉన్న యాగశాలను తాటాకుల కమ్మలతో సిద్ధం చేస్తున్నారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చే వేద పండితులు నవమి వేడుకలకు పది రోజుల ముందు నుంచే యాగశాలలో విశేష హోమాలను ప్రారంభిస్తారు. శివరాత్రి ఉత్సవాల్లో యాగశాలకు ఉన్న పాత తాటాకుల కమ్మలను తొలగించారు. శ్రీరామనవమి సమీపిస్తుండడంతో యథావిధిగా తాటాకులతో యాగశాలను సిద్ధం చేశారు.

పోలింగ్ స్టేషన్ పరిశీలన



భోగాపురంలోని పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తు పోలీస్, రెవెన్యూ అధికారులు

భోగాపురం: ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల సందర్భంగా మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాన్ని పోలీస్, రెవెన్యూ అధికారులు ఆదివారం పరిశీలించారు. తాగునీరు, విద్యుత్ సదుపాయాలను పరిశీలించి, సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఓటు వేయడానికి వచ్చేవారు ఏదైనా ఒక గుర్తింపు కార్డు తీసుకురావాలన్నారు.

రాబోయే తరాల కోసమే సీఎం జగన్ తపన

- ఓట్ల కోసం జగన్ రాజకీయం చేయడం లేదు
- విశాఖపట్నంలో పరిపాలన రాజధాని ఏర్పాట్లు
- ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించిన సీఎం జగన్
- వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు, జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు



మాట్లాడుతున్న జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు

చీపురుపల్లి:

ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఓట్లు కోసం రాజకీయాలు చేయడం లేదని, యువత భవిష్యత్ కోసం, రాబోయే తరాల భవిష్యత్ కోసం నిరంతరం పరితపిస్తున్నారని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు, జిల్లా పరిషత్ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు స్పష్టం చేశారు. పట్టణంలోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఉత్తరాంధ్ర పట్టభద్రులు ఎమ్మెల్సీ ఎన్నికల్లో సీఎం జగన్‌మోహన్‌రెడ్డి బలపరిచిన సీతంరాజు సుధాకర్‌కు మూడవ సీరియల్‌లో తొలి ప్రాధాన్యత ఓటు వేసి మద్దతు ఇవ్వాలని కోరారు. గత ప్రభుత్వ హయాంలో యువత కు నిరుద్యోగ భృతి, ఇంటికో ఉద్యోగం ఇస్తానని చెప్పి, రెండు మూడు నెలలు నిరుద్యోగ భృతి ఇచ్చి తరువాత మోసం చేసిన ఘనత చంద్రబాబునాయుడుదేనని దుయ్యబట్టారు. ఉత్తరాంధ్ర జిల్లాల్లో ఉన్న ప్రజల ఓట్లుతో మూడు సార్లు అధికారాన్ని చేజిక్కించుకున్న చంద్రబాబు ఉత్తరాంధ్ర ప్రాంతానికి తీవ్ర అన్యాయం చేశారని చెప్పారు. కానీ ఉత్తరాంధ్ర భవిష్యత్ కోసం ఇక్కడి పేద ప్రజల భవిష్యత్ కోసం సీఎం జగన్‌మోహన్‌రెడ్డి విశాఖపట్టణంలో పరిపాలన రాజధాని ఏర్పాటు చేస్తున్నట్లు ప్రకటించారన్నారు. రాష్ట్రాభివృద్ధి కోసం ఈ నెల 3, 4 తేదీల్లో గ్లోబల్ ఇన్వెస్ట్‌మెంట్ సమ్మిట్‌ను విశాఖలో ఏర్పాటు చేశారన్నారు. దేశంలోనే పారిశ్రామిక దిగ్గ జాలు ముఖేశ్ అంబానీ, జిందాల్, జీఎంఆర్ వంటి ఎందరో పారిశ్రామికవేత్తలు రావడంతో పాటు రూ.13 లక్షల కోట్లు పెట్టుబడులు పెట్టేందుకు 300కు పైగా ఎంఓయూలు చేసుకున్న సంగతి తెలిసిందేనన్నారు. దీంతో తొలిసారి ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి సామర్థ్యం ప్రపంచానికి అర్థమయ్యిందన్నారు. ఈ గ్లోబల్ సమ్మిట్‌లో జరిగిన ఒప్పందాలు ద్వారా భవిష్యత్‌లో 6 లక్షల మంది యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు రానున్నాయని చెప్పారు. విద్యా వ్యవస్థలో తీసుకొచ్చిన సంస్కరణలకు ప్రపంచ వ్యాప్తంగా ప్రశంసలు వస్తున్నాయని, రాష్ట్రంలో ఉపాధ్యాయ వర్గాల నుంచి కూడా పెద్ద ఎత్తున ఆదరణ లభిస్తోందన్నారు. ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటు హక్కు ఉన్న ప్రతీ ఒక్కరూ తప్పనిసరిగా తమ ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవాలని కోరారు. వైఎస్సార్‌సీపీ నాయకులు ఇప్పిలి అనంతం, వలిరెడ్డి శ్రీనివాసనాయుడు, సువ్వాడ అప్పలనాయుడు, పతివాడ రాజారావు, కరిమజ్జి శ్రీనివాసరావు, దన్నాన జనార్దనరావు, వలిరెడ్డి లక్ష్మణ పాల్గొన్నారు.

పద్మశాలి కులస్తుల సంక్షేమానికి కృషి

- సంఘ రాష్ట్ర అధ్యక్షుడు శ్రీనివాసరావు

నెల్లిమర్ల: పద్మశాలి కులస్తుల సంక్షేమానికి అన్నివిధాలా కృషి చేస్తున్నట్లు ఆ సంఘ రాష్ట్ర అధ్యక్షుడు జె.శ్రీనివాసరావు తెలిపారు. పట్టణంలోని థామస్‌పేటలో సంఘ జిల్లా అధ్యక్షుడు గిడితూరి రాము అధ్యక్షతన ఆదివారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడు తూ, కులస్తులు రాజకీయంగా, సామాజికంగా వెనుకబడ్డారన్నారు. సమస్యలను సమష్టిగా పరిష్కరించుకోవడానికి అందరూ కలిసి రావా లని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో రాష్ట్ర పెద్దల కమిటీ అధ్యక్షుడు టి. వెంకటేశ్వర్లు, సంఘ ప్రతినిధులు కె.బలరాం, కె.చిరంజీవి, గౌరీశంకర్, అప్పలరాజు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న శ్రీనివాసరావు

క్లుప్తంగా

జీడి తోటలు దగ్ధం



కాలిపోయిన తోటలు

రేగిడి: మండలంలోని సంకిలి గ్రామంలో ఆదివారం పలువురు రైతులకు చెందిన జీడి తోటలు అగ్నికి ఆహుతయ్యాయి. పాదచారులు సిగరెట్లు కాల్చి పడేయడంతోనే ఈ ప్రమాదం సంభవించి ఉంటుందని రైతులు భావిస్తున్నారు. ఆరుగాలం కష్టించి పెంచుకున్న తోటలు పంటకు చేతికంది వచ్చే సమయంలో కాలిపోవడంతో తీవ్రనష్టం వాటిల్లిందని రైతులు కొప్పర పుణ్యవతి, బుడుమూరు సూరయ్య, వి.జనార్దన్‌తోపాటు మరో తొమ్మిది మంది వాపోతున్నారు. సుమారు 15 ఎకరాల తోటలు కాలిపోతున్న విషయం తెలుసుకున్న పాలకొండ ఫైర్ సిబ్బంది సంఘటనా స్థలానికి వచ్చి మంటలను అదుపు చేశారు.

145 మద్యం సీసాల స్వాధీనం



స్వాధీనం చేసుకున్న మద్యం బాటిల్స్‌ను చూపిస్తున్న సీఐ లక్ష్మణరావు, తదితరులు

విజయనగరం క్రైమ్: స్థానిక లంకాపట్నంలో అక్రమంగా నిల్వచేసిన 145 మద్యం బాటిల్స్‌ను స్వాధీనం చేసుకుని ఒకరిని అదుపులోకి తీసుకున్నట్లు టూటౌన్ సీఐ సీహెచ్.లక్ష్మణరావు ఆదివారం తెలిపారు. లంకాపట్నంలో అక్రమంగా మద్యం బాటిల్స్ నిల్వచేసి అమ్మకాలు చేస్తున్న విషయం తెలుసుకుని, నిఘా పెట్టామన్నారు. ఈ నేపథ్యంలో చేసిన తనిఖీల్లో మద్యం నిల్వచేసిన వ్యక్తిని అదుపులోకి తీసుకుని నిందితుడిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించామన్నారు.

బోర్ల వైర్లు చోరీ

బొబ్బిలి రూరల్: మండలంలోని అలజంగి గ్రామంలో బోర్ల వైర్లను కత్తిరించి చోరీచేయడంపై గ్రామానికి చెందిన రైతులు ఆవేదన చెందుతున్నారు. సుమారు 18నుంచి 20 మంది వరకు రైతుల బోర్ల వైర్లు కోసేశారని, వాటిని తస్కరించిన వారిని పట్టుకునేందుకు ప్రయతిన్నస్తున్నామని తెలిపారు. దీనిపై గ్రామంలో ఆదివారం సమావేశం నిర్వహించి పోలీసులకు ఫిర్యాదు చేయడానికి నిర్ణయించారు.

రెండు దుకాణాలు దగ్ధం



విశాఖ-అరకు రోడ్డులో జరిగిన అగ్నిప్రమాదం

శృంగవరపుకోట: పట్టణంలోని విశాఖ –అరకు రోడ్డులో ఆదివారం ఉదయం జరిగిన అగ్ని ప్రమాద ఘటనలో రెండు దుకాణాల యజమానులు నష్టపోయారు. స్థానిక షిర్డీ సాయిబాబా గుడి పక్కన ఉన్న చెత్తకు ఉదయం 6గంటల సమయంలో ఎవరో నిప్పు అంటించారు. దీంతో చెత్త కాలడంతో పాటు పక్కనే ఉన్న ఆటోమొబైల్ షాపులో ఉన్న ఆయిల్స్, టైర్లు తదితర వస్తువులు అంటుకున్నాయి. అలాగే అదే ప్రాంతంతో గణేష్ నడుపుతున్న ఏసీ, ఫ్రిజ్‌ల మెకానిక్ షాపునకు కూడా మంటలు వ్యాపించడంతో దుకాణంలో ఉన్న సామగ్రి కాలిపోయింది. దుకాణాల్లో ఉన్న సామగ్రి మొత్తం కాలిపోయి నష్టపోయామని బాధితులిద్దరూ గగ్గోలు పెట్టారు. ప్రమాద వార్త తెలుసుకున్న అగ్నిమాపక సిబ్బంది వచ్చి మంటలు అదుపు చేశారు.

కోడిగుడ్ల ధరలు

హోల్‌సేల్ ధరలు	(100 గుడ్లు)
విశాఖపట్నం	రూ. 420.00
విజయనగరం	రూ. 424.00
శ్రీకాకుళం	రూ. 424.00

బులియన్

విశాఖపట్నం	
బంగారం(24సి. 10గ్రా.)	56,150–00
బంగారం(22సి. 10గ్రా.)	51,800–00
వెండి (కిలో)	71,200–00

చికెన్

బ్రాయిలర్

లైవ్	డ్రెస్డ్	స్కిన్‌లెస్
₹105	₹180	₹ 190

చెరకు రైతుకు ఊరట

- జిల్లాల విభజన అనంతరం సంకిలి ఫ్యాక్టరీకి కొత్త లక్ష్యం
- ఈ ఏడాది లక్ష్యం 4,52,100 టన్నులు
- ఇంతవరకూ సేకరించింది 3,27,708 టన్నులు
- మరో లక్ష టన్నులు సేకరించే అవకాశం
- మూడు జిల్లాల్లో 19,800 ఎకరాల్లో సాగు



కర్మాగారానికి తరలించేందుకు చెరకును నరుకుతున్న రైతులు



తెర్లాం సమీపంలో చెరకు సాగు

రేగిడి: ప్రభుత్వ తీసుకున్న నిర్ణయంతో మూడు జిల్లాల చెరకు రైతులకు ఊరట లభించింది. గతంలో ఉమ్మడి శ్రీకాకుళం జిల్లాలో సంకిలి చక్కెర కర్మాగారం ఒక్క ఆ జిల్లాలో చెరకు రైతులకు మాత్రమే బాసటగా ఉండేది. గత ప్రభుత్వాలు చెరకు సాగుపై దృష్టిసారించలేదు. సాగుచేసే రైతును పట్టించుకోలేదు. ఫలితంగా ఒక్క రేగిడి, పాలకొండ, రాజాం, వీరఘట్టం, ఆమదాలవలస తదితర ప్రాంతాల చెరకు రైతులు మాత్రమే సంకిలి సుగర్స్ ద్వారా లబ్ధిపొందేవారు. ఉమ్మడి విజయనగరం జిల్లాలోని భీమసింగి, బొబ్బిలి సర్కిల్‌లోని సుగర్ ఫ్యాక్టరీల పరిధిలో రైతులు తీవ్ర ఇబ్బందులు పడేవారు. అక్కడి ఫ్యాక్టరీలు మూతపడడంతో రైతులు ఇక్కడి ఫ్యాక్టరీకి చెరకును తీసుకురాలేక చాలా అవస్థలు పడేవారు. ఇక్కడి నుంచి చెరకు కటింగ్ ఆర్డర్లు ఆ ప్రాంత రైతులకు వచ్చేవి కాదు.

ప్రభుత్వ విధానంతో పెరిగిన సాగు

జిల్లా విభజన అనంతరం సంకిలిలోని ఈఐడీ ప్యారీ సుగర్స్ ఫ్యాక్టరీ విజయనగం జిల్లా పరిధిలోకి వచ్చింది. అంతేకాకుండా చెరకు రైతును ప్రోత్సహించేందుకు రాష్ట్ర ప్రభుత్వం కొత్త నిర్ణయం తీసుకుంది. కర్మాగారం యాజమాన్యంతో మాట్లాడి, విజయనగరం, శ్రీకాకుళం, పార్వతీపురం మన్యం జిల్లాల్లోని చెరకు రైతుల దగ్గర చెరకును తీసుకునేలా ఒప్పించింది. దీంతో ఈ కర్మాగారం పరిధిలో తగ్గుతూ వచ్చిన చెరకు సాగు పెరిగింది. గతంలో ఒక్క శ్రీకాకుళం జిల్లా పరిధిలో సంకిలి పరిసర ప్రాంతాల్లో 8 వేల హెక్టార్ల వరకూ మాత్రమే చెరకు సేకరణ జరిగేది. ఈ ఏడాది ఈ మూడు జిల్లాల్లో మొత్తం 19,800 ఎకరాల్లో రైతులు చెరకు సాగు చేస్తుండగా భీమసింగి, బొబ్బిలి, సంకిలి జోన్‌ల పరిధిలో 16,200 వేల ఎకరాల్లోని చెరకును

ఫ్యాక్టరీ కొనుగోలు చేసింది. ఈ ఏడాది చెరకు సేకరణ లక్ష్యం 4,52,100 టన్నులుగా నిర్దేశించగా ఇప్పటివరకు 3,27,708 టన్నుల చెరకును సేకరించింది. మరో నెలరోజులు పాటు క్రషింగ్ ఉండడంతో మరో లక్ష టన్నుల చెరకును సేకరించే అవకాశం కూడా ఉందని ఫ్యాక్టరీ యాజమాన్యం వెల్లడించింది. గతంలో కంటే ఈ ఏడాది లక్ష్యం పెరగడంతో ఫ్యాక్టరీ కూడా క్రషింగ్‌ను పెంచి రైతులకు బాసటగా నిలిచింది.

సకాలంలో చెల్లింపులు

ప్యారీ కర్మాగారం చెరకు రైతును ప్రోత్సహించే దిశగా చర్యలు చేపట్టింది. ఇప్పటివరకూ ఫ్యాక్టరీకి తరలించిన చెరకుకు రూ.82.80 కోట్లు రైతులకు చెల్లించింది. మరో రూ.10 కోట్లు మాత్రమే చెల్లించాల్సి ఉంది. మార్చి నెలాఖరునాటికి మిగిలిన రూ.10 కోట్లు చెల్లించే ఏర్పాట్లు చేసింది. అంతేకాకుండా చెరకు మద్దతుధర టన్నుకు రూ.2980లు కాగా మరో రూ.100లు అదనంగా ఫ్యాక్టరీ చెల్లిస్తోంది. ఎకరా సాగులో 35 నుంచి 40 టన్నుల మేర చెరకు దిగుబడి వస్తున్నట్లు రైతులు అభిప్రాయం వ్యక్తంచేస్తున్నారు. చెరకు నాటే రైతులకు ముందుగా విత్తనాలు, మధ్యలో ఎరువుల పంపిణీని కర్మాగారం చేపడుతోంది. ఈ ఏడాది మూడుజిల్లాల పరిధిలో మొత్తం 9,500 మంది రైతులు లబ్ధి పొందారు.

జోన్ల వారీగా సేకరించిన చెరకు వివరాలు

ఎన్‌సీఎస్ పరిధిలో	: 74,585 టన్నులు
భీమసింగి పరిధిలో	: 11,432 టన్నులు
ఫ్యాక్టరీ పరిధిలో	: 2,41,691 టన్నులు

ఐదేళ్లుగా మద్దతు ధర..

సంవత్సరం	మద్దతు ధర (రూపాయల్లో)
2018-2019	2,750
2019-2020	2,750
2020-2021	2,800
2021-2022	2,900
2022-2023	2,980



సంకిలి ప్యారీ సుగర్స్ ఫ్యాక్టరీ

రైతుకు అన్ని విధాలా భరోసా



రైతు బాగుండాలి, కర్మాగారం బాగుండాలి అనే ఉద్దేశంతో ముందుకు వెళ్తున్నాం. మమ్మల్ని నమ్మి చెరకు సాగు చేస్తున్న రైతుకు నష్టం లేకుండా చూస్తున్నాం. కర్మాగారానికి చెరకు సరఫరా చేసిన 14 రోజుల్లోనే నేరుగా రైతు ఖాతాలో నగదు జమ చేస్తున్నాం. ఈ ఏడాది మా కర్మాగారంతో పాటు భీమసింగి, బొబ్బిలి ఎన్‌సీఎస్ ఫ్యాక్టరీ జోన్‌ల పరిధిలో పక్క జిల్లాల రైతులు కూడా మా కర్మాగారానికే చెరకు సరఫరా చేశారు. మొత్తం 12 వేల హెక్టార్లలో చెరకును ఈ ఏడాది క్రషింగ్ చేశాం.

– ఏవీ నాగేశ్వరరెడ్డి, అసోసియేట్ వైస్ ప్రెసిడెంట్, ఈఐడీ ప్యారీ చక్కెర కర్మాగారం, సంకిలి

తల్లీకూతుళ్లపై దాడి

- తొమ్మిదిమందిపై కేసు నమోదు



గ్రామంలో గొడవ జరుగుతున్న దృశ్యం

వంగర: మండల పరిధి సీలయ్యవలస గ్రామంలో తల్లీకూతుళ్లపై మహిళలపై అదే గ్రామానికి చెందిన కొంత మంది వ్యక్తులు ఆదివారం దాడికి పాల్పడినట్లు ఎస్సై బుడుమూరు లోకేశ్వరరావు తెలిపారు. వివరాలిలా ఉన్నాయి. గ్రామానికి చెందిన రీసి అన్నపూర్ణ ఇంటి ఆవరణలో గ్రామస్తులు కొంత మంది వ్యక్తులు చెత్త పారబోశారు. తమ ఇంటి వద్ద ఎందుకు చెత్తవేస్తున్నారని ఆమె ప్రశ్నించగా గొండేల సత్యం, మరికొంత మంది ఆమెను కొంత దూరం ఈడ్చుకువెళ్లారు. ఎందుకు ఇలా చేస్తున్నారని ఆమె కుమార్తె ఈశ్వరమ్మ (మడ్డువలస సచివాలయం హెల్త్ సెక్రటరీ) అడ్డుపడగా..ఆమెను కూడా విచక్షణా రహితంగా కొట్టి కాళ్లతో తన్నినట్లు బాధితులు ఫిర్యాదు చేశారు. ఫిర్యాదు మేరకు గొండేల సత్యంతో పాటు మరో తొమ్మిది మందిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై బుడుమూరు లోకేశ్వర రావు తెలియజేశారు.

కొట్లాటలో ముగ్గురికి గాయాలు

పార్వతీపురం: రోడ్డుపై ఉన్న కంకర రాళ్లు తీయనందుకు డ్రైవర్, హెల్పర్‌లు ముగ్గురిని గాయపరిచారు. ఈ సంఘటనపై పార్వతీపురం ఆస్పత్రి అవుట్ పోస్టు పోలీసులు ఆదివారం తెలిపిన వివరాలిలా వున్నాయి. గరుగుబిల్లి మండలం దళాయివలసకు చెందిన సీహెచ్. చంద్రమౌళి తన ఇంటికి శ్లాబ్ పనులు నిర్వహించాడు. శ్లాబ్ పనులు పూర్తికాగా మిగిలిన రాయి, ఇసుక రోడ్డుకు అడ్డగా ఉన్నాయి. ఇంతలో ఆ రోడ్డుమీదుగా ఓ వ్యాన్ రాగా రోడ్డుపై ఉన్న కంకర తీయాలని డ్రైవర్ అడిగాడు. భోజనం తినేసిన తరువాత తీస్తానని మౌళి తెలిపాడు. దీంతో ఇద్దరి మధ్య ఈ విషయంలో తీవ్రస్థాయిలో వాగ్వాదం జరిగింది. అదికాస్తా ముదిరి తోపులాట జరిగింది. దీంతో డ్రైవర్ శంకరరావు, క్లీనర్‌లు చంద్రమౌళి చొక్కాపట్టుకుని లాక్కెళిపోయాడు. అదేమని చంద్రమౌళి తండ్రి ఉమామహేశ్వరరావు, డ్రైవర్, క్లీనర్‌లను అడగ్గా ఆయనను కూడా దుర్భాషలాడి నుదుటిపై, కన్నుపై గాయపరిచారు. ఈగొడవను విడిపించడానికి వచ్చిన చంద్రమౌళి చెల్లి సంతోషికుమారిని కూడా ఇసుకలో పడదోసి కొట్టారు. దీంతో కుటుంబంలో గాయాల పాలైన ముగ్గురూ చికిత్స కోసం ఆస్పత్రిలో చేరారు. ఆస్పత్రి ఔట్‌పోస్టు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వాలీబాల్ నూతన అసోసియేషన్ ఏకగ్రీవం



నూతన కార్యవర్గాన్ని అభినందిస్తున్న అసోసియేషన్ ప్రతినిధులు

విజయనగరం: జిల్లా వాలీబాల్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులుగా జి.సూరిబాబు (కొత్తవలస), కేవీఏఎస్ రాజు, కోశాధికారిగా కె.సన్యాసినాయుడుతో పాటు మరో 23 మందితో నూతన జిల్లా కమిటీ ఏకగ్రీవంగా ఎన్నికైంది. ఈ మేరకు జిల్లా వాలీబాల్ సర్వసభ్య సమావేశం పూర్వ అధ్యక్షుడు కృష్ణంరాజు అధ్యక్షతన ఆదివారం సిటీ క్లబ్‌లో జరిగింది. కార్యదర్శి నివేదికను జిల్లా పూర్వ కార్యదర్శి భగవాన్ దాస్ ప్రవేశ పెట్టా రు. అనంతరం ఏకగ్రీవంగా 25 మందితో నూతన జిల్లా కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన విశాఖపట్నం జిల్లా వాలీబాల్ అసోసియేషన్ కార్యదర్శి ప్రసాద్ రాజు మాట్లాడుతూ విజయనగరం జిల్లా వాలీబాల్ జట్టుతో అడలంటే రాష్ట్రంలో అన్ని జట్లు ప్రణాళిక వేయకుండా తలబడే పరిస్థితి లేదన్నారు. ఆ స్థాయికి జిల్లా వాలీబాల్ అసోసియేషన్‌ను తీసుకెళ్లడం జిల్లాలో ఉన్న వాలీబాల్ ప్రేమికుల సహకారం వల్ల సాధ్యమైందన్నారు. అనంతరం ఇంతవరకు అసోయేషన్ అధ్యక్ష, కార్యదర్శులుగా ఉన్న కృష్ణంరాజు, భగవాన్ దాస్ లు బాధ్యతల నుంచి రిలీవ్ అయిన సందర్భంగా అసోసియేషన్ సభ్యులు ఘనంగా సత్కరించారు. సమావేశంలో శాప్ వెయిట్ లిఫ్టింగ్ కోచ్ శ్రీనివాసరావు, జిల్లా వ్యాయామ ఉపాధ్యాయుల సంఘం అధ్యక్షుడు ఎస్.వెంకటనాయుడు, సీఐ బాలకృష్ణ, కనకల.కృష్ణ, సాంబ, సీనియర్ క్రీడాకారులు, వాలీబాల్ అభిమానులు పాల్గొన్నారు.

గంజాయి తరలిస్తున్న ఇద్దరి అరెస్టు



వివరాలు వెల్లడిస్తున్న సీఐ వినోద్‌బాబు

పాతపట్నం: గంజాయి తరలిస్తున్న ఒడిశాకు చెందిన ఇద్దరిని ఆదివారం పాతపట్నం ఆర్టీసీ కాంప్లెక్స్ సమీపంలో రాష్ట్ర సరిహద్దు చెక్‌పోస్ట్ వద్ద అరెస్ట్ చేసినట్లు సీఐ ఎం.వినోద్‌బాబు తెలిపారు. పాతపట్నం పోలీస్‌స్టేషన్‌లో ఆదివారం నిందితులను మీడియా ముందు ప్రవేశపెట్టారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ ఒడిశా రాష్ట్రం గజపతి జిల్లా లింగా స్వరగ గ్రామానికి చెందిన ముకుంద నాయక్, ఉడ్రిపడర్ గ్రామానికి చెందిన భంబో మాలిక్‌లు కలిసి పోయిపడగడ గ్రామానికి చెందిన ఐబోరైతో వద్ద 25 కేజీల గంజాయిని కొనుగోలు చేసుకుని ద్విచక్రవాహనంపై బయలుదేరారు. పాతపట్నం, హిరమండలం మీదుగా ఆమదాలవలస రైల్వేస్టేషన్‌కు చేరుకుని విజయవాడలో ఉంటున్న రమోరైతోకు అమ్మాలని నిర్ణయించారు. పాతపట్నం సరిహద్దు చెక్‌పోస్ట్‌లో ఎస్ఐ ఎస్.కామేశ్వరరావు, రెవెన్యూ సిబ్బంది వాహన తనిఖీలు చేస్తుండటంతో వీరిద్దరూ పట్టుబడ్డారు. కార్యక్రమంలో వీఆర్వోలు బాలరాజు, పార్థసారధి, సిబ్బంది పాల్గొన్నారు.

చాకచక్యంగా మొబైల్ ఫోన్ చోరీ

కంచిలి: మండల కేంద్రం కంచిలిలోని సాయిరాం మెడికల్ షాపునకు గుర్తు తెలియని వ్యక్తి వచ్చి బద్రి మిన్నారావుకు చెందిన సెల్‌ఫోన్‌ను చాకచక్యంగా దొంగిలించాడు. ఆదివారం ఈ ఘటన చోటుచేసు కొంది. ఓ వ్యక్తి మూగవాడినని చెప్పి కొన్ని కాగితాలను చూపిస్తూ కౌంటర్ మీద ఉన్న మొబైల్ ఫోన్‌ను ఆ కాగితాలు అడ్డుగా పెట్టుకొని దొంగిలించి అక్కడి నుంచి ఉడాయించాడు. కొంతసేపటి తర్వాత తన మొబైల్ పోయిందని గుర్తించిన మిన్నారావుకు ఏం జరిగిందో అర్థం కాలేదు. షాపులో ఉన్న సీసీ ఫుటేజీని పరిశీలించడంతో సదరు వ్యక్తే మొబైల్‌ను దొంగిలించిన విషయాన్ని గుర్తించాడు. వెంటనే బయటకు వచ్చి చుట్టుపక్కల వెతికినా కనిపించలేదు. అనంతరం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

కోటి లింగేశ్వరాలయానికి రూ.1.34 కోట్ల వితరణ



దున్న గురుమూర్తిని సన్మానిస్తున్న దృశ్యం

సోంపేట: చారిత్రక ప్రాధాన్యత కలిగిన బారువ కోటిలింగేశ్వర ఆలయం గర్భగుడి, అంతరాలయాన్ని పవిత్రమైన కృష్ణశిలతో నిర్మించేందుకు అవసరమైన రూ.1.34 కోట్ల నిధులను భరించేందుకు అదే గ్రామానికి చెందిన దున్న గురుమూర్తి దంపతులు ముందుకువచ్చారు. ఈ మేరకు ఆదివారం ఆలయ ప్రాంగణంలో దాతను స్థానిక సర్పంచ్ యర్ర రజనీ, గ్రామపెద్దలు ఘనంగా సత్కరించారు. సుదీర్ఘకాలంగా భక్తుల విశ్వాసాన్ని చూరగొన్న శివాలయం నిర్మాణ ఖర్చును భరించేందుకు గురుమూర్తి ముందుకురావడం శుభపరిణామమని పేర్కొన్నారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ గుర్రాల శ్రీనివాస్, ఎంపీటీసీ తామాడ విశ్వనాథం, మద్ది చంద్రశేఖర్, రాజేష్ ఖన్నా, గుర్రాల సత్యం, భువనేశ్వర్ ప్రసాద్ పాణిగ్రాహి తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రాల్లో ఆర్‌ఓ ప్లాంట్లు

- సురక్షితనీటిని అందిస్తున్న ప్రభుత్వం



రాజాం అంగన్‌వాడీ కేంద్రంలో ఏర్పాటు చేసిన ఆర్‌ఓ ప్లాంట్

విజయనగరం ఫోర్ట్: అంగన్‌వాడీ కేంద్రాల్లో చదివే పిల్లలు, గర్భిణులకు సురక్షిత తాగునీటిని అందించేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టింది. ఈ మేరకు జిల్లాలోని పలు అంగన్‌వాడీ కేంద్రాల్లో తొలివిడతగా ఆర్‌ఓ ప్లాంట్లను ఏర్పాటు చేసింది. దశల వారీగా మిగతా కేంద్రాల్లో కూడా ఏర్పాటు చేయనుంది.

220 కేంద్రాల్లో ప్లాంట్ల ఏర్పాటు

జిల్లాలో తొలివిడతలో ప్రాజెక్టుకు 20 కేంద్రాలు చొప్పున 220 కేంద్రాల్లో ఆర్‌ఓ ప్లాంట్లను ఏర్పాటు చేశారు. వాటి ద్వారానే పిల్లలకు నీరు అందిస్తున్నారు.

సురక్షిత నీరు అందజేత

అంగన్‌వాడీ కేంద్రాల్లో ఆర్‌ఓ ప్లాంట్లు ఏర్పాటు చేశాం. ఈ ప్లాంట్ల ద్వారా పిల్లలు, గర్భిణులకు సురక్షిత నీటిని అందించనున్నాం.

– బి.శాంతకుమారి, జిల్లా స్త్రీ, శిశు సంక్షేమ సాధికారిత అధికారిణి

ఆన్‌లైన్ ప్రదర్శనకు బొండపల్లి విద్యార్థి ప్రాజెక్టు



రాష్ట్ర స్థాయికి ఎంపికైన షర్మిల గాయత్రి ప్రాజెక్టు

బొండపల్లి: ఇన్‌స్పైర్ అవార్డుల కోసం 10 వతరగతి లోపు విద్యార్థులకు జిల్లా స్థాయిలో ఎస్‌ఐఎఫ్ న్యూఢిల్లీ వారు శనివారం నిర్వహించిన అన్‌లైన్ విజ్ఞాన ప్రదర్శనలలో బొండపల్లి జెడ్పీ హైస్కూల్ విద్యార్థిని ప్రదర్శన రాష్ట్రస్థాయి ప్రదర్శనకు ఎంపికైంది. మండలంలోని ముద్దూరు పంచాయతీ తమటాడ గ్రామానికి చెందిన కొండా షర్మిల గాయత్రి బొండపల్లి జెడ్పీ హైస్కూల్‌లో 9 వతరగతి చదువుతూ అన్‌లైన్ పోటీల్లో పాల్గొని ప్రదర్శన ఇచ్చినట్లు హెచ్ఎం టి.సన్యాసిరాజు తెలిపారు. తమ విద్యార్థిని ప్రదర్శించిన (ద థర్డ్ ఐ ఫర్ బ్లైండ్ పీపుల్) విజ్ఞాన ప్రాజెక్టు రాష్ట్ర ప్రదర్శనకు ఎంపికైనట్లు సంతోషం వెలిబుచ్చారు. ఈ విద్యార్థిని గత ఏడాది ఎన్ఎంఎంఎస్ పరీక్షల్లో కూడా ప్రతిభ కనబరిచి ఉపకార వేతనానికి ఎంపికైనట్లు తెలిపారు. విద్యార్థిని గైడ్ జి.రాజశేఖర్‌తో పాటు గ్రామ సర్పంచ్ మునకాల పైడిపు నాయుడు, ఉపాధ్యాయులు ఆమెను ఈ సందర్భంగా అభినందించారు.

పటిష్ట బందోబస్తు మధ్య ఎమ్మెల్సీ ఎన్నికలు

- డీఎస్పీ మోహన రావు



మాట్లాడుతున్న డీఎస్పీ మోహన రావు

బొబ్బిలి: సబ్ డివిజన్ పరిధిలో ఎమ్మెల్సీ ఎన్నిక పోలింగ్‌కు పటిష్ట బందోబస్తు ఉందని, ప్రశాంత వాతావరణంలో ఓటుహక్కు వినియోగించుకునేందుకు అన్ని ఏర్పాట్లూ చేసినట్లు డీఎస్పీ బి మోహన రావు తెలిపారు. ఈ మేరకు బొబ్బిలిలో ఆదివారం సాయంత్రం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ సబ్ డివిజన్ పరిధిలో ఒక డీఎస్పీ,14 మంది సీఐలు, 21 మంది ఎస్సైలు, 20మంది ఏఎస్సైలు,105 మంది కానిస్టేబుళ్లు, 95 మంది హోం గార్డులను నియమించినట్టు చెప్పారు. అలాగే చీపురుపల్లి సబ్ డివిజన్‌లో ఒక ఏఎస్పీ, ఒక డీఎస్పీ, సీఐలు14 మంది, ఎస్సైలు 21 మంది, ఏఎస్సైలు 20 మంది, కానిస్టేబుళ్లు 105 మంది,95 మంది హోం గార్డులను నియమించామన్నారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా సిబ్బంది చర్యలు తీసుకుంటారన్నారు.

అప్పుల బాధ తాళలేక వ్యక్తి ఆత్మహత్య



చిన్నికోటి రాంబాబు(ఫైల్)



రాము మృతదేహం

భోగాపురం: మండలంలోని పెద్దకవుల వాడ గ్రామానికి చెందిన చిన్నికోటి రాంబాబు(34) అప్పుల బాధ తాళలేక ఇంట్లో ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఆదివారం మాధ్యాహ్నం జరిగిన ఈ సంఘటనపై మృతుని బంధువులు పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. రాంబాబు ఆటో నడుపుకుంటూ కుటుంబజీవనం సాగిస్తున్నాడు. భార్య వరలక్ష్మితో పాటు ఇద్దరు పిల్లలు ఉన్నారు. ఈమధ్య కాలంలో మద్యానికి బానిసై అప్పులపాలయ్యాడు. ఆదివారం ఉదయం ఇంటి నుంచి బయటకు వెళ్లి పూటుగా మద్యం తాగి ఇంటికి వచ్చాడు. దీంతో భార్య వరలక్ష్మి భర్తతో ఘర్షణ పడి తోటికోడలితో కలిసి పక్కనే ఉన్న ఉప్పిలి అప్పలసూరి ఇంటికి వెళ్లింది. ఈ క్రమంలో సుమారు 12 గంటల సమయంలో పాదుపు డబ్బులు అడగడానికని చెప్పి గ్రామానికి చెందిన అంకయ్యమ్మ రాంబాబు ఇంటికి వచ్చింది. ఆ సమయంలో ఇంట్లో ఉరివేసుకుని దులానికి వేలాడుతూ రాంబాబు కనిసిచడంతో కేకలు వేసింది. దీంతో పక్క ఇంట్లోనే ఉన్న భార్య వరలక్ష్మితో పాటు చుట్టు పక్కల వారు వచ్చి రాంబాబును కిందికి దించి హుటాహుటిన తగరపువలస ఎన్ఆర్ఐ ఆస్పత్రికి తరలించగా అప్పటికే చనిపోయినట్లు వైద్యులు నిర్ధారించారు. మృతుని భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై కృష్ణమూర్తి తెలిపారు.

పెద్దగెడ్డలో దూకి మరొకరు..

పాచిపెంట: మండలంలోని పెద్దగెడ్డజలాశయంలో దూకి ఓవ్యక్తి ఆదివారం ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ సంఘటనపై పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. లారీ క్లీనర్‌గా పనిచేస్తున్న సాలూరు పట్టణానికి చెందిన పెంటరాము మద్యానికి బానిసయ్యాడు, భర్త మద్యానికి బానిస అవడంతో భరించలేని భార్య మూడునెలల కిందట కన్నవారింటికి వెళ్లిపోయింది. అయితే ఇటీవల రాము మద్యం మత్తులో భార్య వద్దకు వెళ్లి ఇంటికి రావాలని కోరాడు, మద్యం మానివేస్తేనే వస్తానని, లేకపోతే రానని తెగేసి చెప్పింది. అప్పటి నుంచి తీవ్ర మనస్తాపానికి గురైన రాము ఆదివారం ఉదయం మళ్లీ మద్యంమత్తులో భార్య వద్దకు వెళ్లగా మళ్లీ అదే సమాధానం చెప్పింది. దీంతో వరసకు సోదరుడైన చంటి అనే వ్యక్తిని పాచిపెంటలో పని ఉందని చెప్పి రాము తీసుకువచ్చాడు, శివాలయం సమీపంలో చంటిని ఉండమని చెప్పి ఫోన్ మాట్లాడుకుంటూ జలాశయం దగ్గరకు వెళ్లి దూకేశాడు. అదిచూసిన చంటి పెద్దగా అరిచి స్థానికులకు విషయం చెప్పడంతో వెంటనే పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని ఈతగాళ్ల సహాయంతో రామును బయటకు తీశారు. అయితే అప్పటికే మృతి చెందడంతో మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం సాలూరు సీహెచ్‌సీకి తరలించారు.